సాక్షి రంగారెడ్డి

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



రాజ్యాంగ స్ఫూర్తికి రక్షణ

రాజ్యాంగ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరించండి

పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. 8లో▸



జూ చూసొద్దాం

పాతబస్తీలోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడుతున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

వానరానికి అంత్యక్రియలు



వానరానికి అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో కొన్నేళ్లుగా నిత్యం జనం మధ్య కలివిడిగా తిరుగుతూ, వారు పెట్టే పండ్లు, ఆహారం తింటూ జీవిస్తున్న ఓ వానరం మంగళవారం స్థానిక హనుమాన్ దేవాలయంలో మృతి చెంది కనిపించింది. గమనించిన ఆలయ నిర్వాహకులు విషయాన్ని స్థానిక శ్రీ సీతారామంజనేయ స్వామి భజన మండలి సభ్యులకు తెలిపారు. వారు గ్రామస్తులతో సమావేశమై వానరాన్ని ఆంజనేయుడికి ప్రతి రూపంగా భావించి అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. వానర కళేబరాన్ని ట్రాక్టర్‌పై ఉంచి బ్యాండ్ మేళాలు, భజన పాటలతో ఊరేగింపుగా వెళ్లి స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. నిత్యం గ్రామస్తుల మధ్య కలియ తిరిగే వానరం మృతితో పలువురు కంటతడి పెట్టుకున్నారు.

పట్టణ పరిధిలో ఉపాధి పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

మొయినాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం)ను పట్టణాల్లోనూ అమలు చేయాలని భారత కిసాన్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. మండల పరిధిలోని సజ్జనపల్లి గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం సంఘం జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలకొండ కాంతయ్య మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలతో 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వ హయాంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టరూపం దాల్చిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత నిధులు తగ్గించి రోజురోజుకూ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా అలాంటి పనులు మానుకోవాలని హితవు పలికారు. ఈ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజు కూలీ కొలతలతో సంబంధం లేకుండా కనీసం రూ.700 ఇవ్వాలని, కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.లక్ష్మయ్య, జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుకి రూ.లక్ష చెక్కు అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని కొండ్రిగాని బోడ్ తండాకు చెందిన బాణవత్ మస్రూ ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన తొలివిడత రూ.లక్ష చెక్కును అందుకుంది. హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా పలువురు లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున తొలి విడత చెక్కులు పంపిణీ చేశారు. ఇదే కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాణవత్ మస్రూకు కూడా చెక్కును అందజేశారు.

కప్పపహాడ్ లబ్ధిదారుకు చెక్కు..

ఇబ్రహీంపట్నం రూరల్: మండల పరిధిలోని కప్పపహాడ్‌కు చెందిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు చెరువెంక అశ్వినీ దంపతులు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కు అందుకున్నారు. శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.



చెక్కుతో అశ్వినీ దంపతులు

వాన.. హైరానా

రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలు

- పలుచోట్ల విరిగిపడిన చెట్లు
- వడగళ్లకు దెబ్బతిన్న పంటలు
- చేతికొచ్చిన వేళ నేలపాలు
- నష్టాలపాలైన రైతులు

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం భారీ ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. రోడ్లు జలమయం అయ్యాయి. పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. సోమవారం పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి వడగళ్ల వానకు వరి, మొక్కజొన్న, మామిడి, టమాటతోటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.



కొందుర్గు: ఆగిర్యాలలో ఒరిగిన స్తంభం



దెబ్బతిన్న వరి పంటను చూపిస్తున్న మహిళా రైతులు

పంటలకు తీవ్ర నష్టం

యాచారం: వడగళ్ల వర్షం సోమవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాల్లో పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. ఈదురుగాలులు, గోలీల మాదిరి వడగళ్ల వానతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ఆయా గ్రామాల్లో 250 ఎకరాలకు పైగా వరి, వంద ఎకరాలకు పైగా మామిడి, పలు రకాల కూరగాయల పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మరి కొద్ది రోజుల్లో చేతికందే వరి గింజలన్నీ నేలరాలాయి. బోరుబావుల్లో ఉన్న కొద్దిపాటి భూగర్భజలాలతో రైతులు వరి పంటను బతికించుకుంటున్నారు. గింజలు గట్టి పడే సమయం, మరి కొద్ది రోజుల్లో పంటను కోసే అవకాశం ఉండగా వడగళ్ల వర్షం కురిసి వారి కష్టం నేలపాలైంది. ఆయా గ్రామాల్లో షెడ్ల రేకులు గాలికి ఎగిరిపోయాయి.

నష్టపోయిన పంటల సర్వే..

ఆయా గ్రామాల్లో వడగళ్ల వర్షంతో నష్టపోయిన పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల విస్తరణ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. వరి, మామిడి, పలు రకాల కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని, రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నేలకొరిగిన చెట్లు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షానికి రోడ్లు, వీధులు జలమయంగా మారాయి. ఈదురు గాలులకు ఔటర్ సర్వీస్ రోడ్లలో చెట్లు నేలకొరిగాయి.



ఔటర్ రింగు రోడ్డులో నేలకొరిగిన చెట్లు



తలకొండపల్లి: బదనాపూర్‌లో నేలరాలిన మామిడి కాయలు



ఆగిర్యాలలో నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతులు

గాలివాన బీభత్సం

కొందుర్గు: మండలంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. వరిపంట దెబ్బతింది. మామిడికాయలు నేల రాలాయి. ఆగిర్యాల, వెంకిర్యాల గ్రామాల్లో దాదాపు పది విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. లక్ష్మీదేవిపల్లిలో ఓ రైతు పౌల్ట్రీషెడ్ పై కప్పు రేకులు ఎగిరిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయా గ్రామాలను సందర్శించి పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఉద్యానవన అధికారి హిమబిందు తెలిపారు.



లక్ష్మీదేవిపల్లిలో ధ్వంసమైన పౌల్ట్రీషెడ్ పై కప్పు

మీర్‌పేటలో కూలిన చెట్లు



టీఎస్‌ఆర్ కాలనీలో రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ

మీర్‌పేట: మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు, వడగళ్ల వానతో కార్పొరేషన్ పరిధిలోని కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. టీఎస్‌ఆర్ కాలనీ రోడ్ నెం-2లో చెట్టు కొమ్మ విరిగి పడింది. జిల్లెలగూడ రాఘవేంద్ర కాలనీ రోడ్ నెం-4లో చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడడంతో వైర్లు తెగిపడ్డాయి. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు.

'నేలరాలిన' ఆశలు

ఆమనగల్లు: ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు, వడగళ్లతో కురిసిన వర్షం రైతులకు కన్నీటిని మిగిల్చింది. చేతికి వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలాయి. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, రాంనుంతల, శెట్టిపల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు మామిడితోటలు దెబ్బతిన్నాయి. తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి, చంద్రదన, రాంపూర్, బదనాపూర్ గ్రామాల్లో వడగళ్ల వానకు వరి, మొక్కజొన్న, మామిడి, టమాట తోటలు పాడయ్యాయి. దెబ్బతిన్న పంటలను మంగళవారం వ్యవసాయశాఖ ఏడీ శోభారాణి, మండల వ్యవసాయాధికారి రేణుక చక్రవర్తి పరిశీలించారు. దాదాపు 59 మంది రైతులకు చెందిన 83 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. రెండెకరాల్లో టమాటాతోట, పలు మామిడితోటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు.



తలకొండపల్లి మండలం చంద్రదనలో వర్షానికి నేలరాలిన వరి

ఉదయం ఎండ.. సాయంత్రం దండా

షాబాద్: మండలంలో మంగళవారం వడగళ్లతో కూడిన భారీ వర్షం కురిసింది. చేతికొచ్చిన వరి, మామిడి తోటలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. ఉదయం నుంచి ఎండ, సాయంత్రానికి వర్షం పడడంతో ఒక్క సారిగా వాతావరణం చల్లబడింది.



నాగర్‌గూడలో కురుస్తున్న వర్షం

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు



షాద్‌నగర్: ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జాతీయ బృందం సభ్యులు

షాద్‌నగర్: ఆయిల్‌పామ్‌తో రైతులు అధిక లాభాలు పొందొచ్చని ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్లలో రైతు నర్సింహారెడ్డి సాగు చేసిన ఆయిల్‌పామ్‌ను పంటను కేంద్రం బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పొన్ను స్వామి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు చాలా మంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. నీటి వసతులు ఉన్న వ్యవసాయ క్షేత్రాల్లో సాగు చేస్తే ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని చెప్పారు. ఈ తోటలకు చీడపీడలు సోకే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. తోట సాగులో ఎదురయ్యే సవాళ్లను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ విజయకృష్ణ, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం పరిధిలో పంటల పరిశీలన

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి గ్రామాల్లో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను మంగళవారం ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ పొన్ను స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ పంటకు లేని విధంగా ఆయిల్‌పామ్‌కు చట్టం ఉందన్నారు. జిల్లాలో వ్యాల్యూ అనే కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ సరోజిని, వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ సంస్థ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జిల్లా ఉద్యాన అధికారి సురేష్, ఏడీహెచ్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బడంగ్‌పేట్: బాధ్యత గల ప్రభుత్వం భద్రతను గాలికొదిలేసిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బడంగ్‌పేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు పర్యాయాలు రైతుభరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకొంటోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని చిత్తశుద్ధితో అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన బీఆర్‌ఎస్ బహిరంగసభకు పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కందుకూరు మండల అధ్యక్షుడు జయేందర్, మహేశ్వరం మండల అధ్యక్షుడు రాజునాయక్, తుక్కుగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

'ఫార్మా' సర్వేను అడ్డుకోవద్దు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనులను అడ్డుకోవద్దని, అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని సర్వేనంబర్ 109, 114లోని రైతులతో మంగళవారం యాచారం తహసీల్దార్ కార్యాలయంలో ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో రెవెన్యూ, అటవీ శాఖ, టీజీఐఐసీ అధికారులతో ఉమ్మడి సర్వే నిర్వహిస్తామని, ఏఏ సర్వే నంబర్లలో ఏ భూములున్నాయో గుర్తిస్తామని తెలిపారు. దీంతో అర్హులైన రైతులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించి వెళ్లిపోయారు. సమావేశంలో తాడిపర్తి మాజీ సర్పంచ్ దూస రమేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముప్పిడి బావయ్య, స్థానిక టీజేఎస్ నాయకుడు నిరంజన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే, ఫెన్సింగ్ పనులు

ఫార్మాసిటీ భూముల సర్వే, ఫెన్సింగ్ పనుల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. పది రోజుల క్రితం నక్కర్తమేడిపల్లి నుంచి పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారానికి దాదాపు 35 కిలోమీటర్ల మేర సర్వే జరిగింది. ముందు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు మధ్య పనులు చేస్తున్నారు.

క్రేజీ ఫ్రూట్స్!



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నగరానికి విదేశాల నుంచి పండ్లు దిగుమతి అవుతున్నాయి. న్యూజిలాండ్, ఇరాన్, స్పెయిన్, అమెరికా, దక్షిణాఫ్రికా, చిలీ, ఆస్ట్రేలియా, చైనా, ఇటలీ, ఫ్రాన్స్, ఇరాన్, సౌదీ వంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నాయి. ప్రధానంగా యాపిల్, కివీ, ప్లమ్, పియర్, డ్రాగన్, ఖర్జూర, చెర్రీ వంటి ఖరీదైన పండ్లు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి కూడా కొన్ని వెరైటీలు సరఫరా అవుతున్నాయి. కొన్ని ఫ్రూట్స్ ఏడాది పొడవునా.. మరికొన్ని సీజన్ వారీగా విపణిలో అందుబాటులో ఉంటున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా అరటి, నారింజ, దానిమ్మ, నల్ల ద్రాక్ష, పైనాపిల్, జాక్‌ఫ్రూట్ వంటివి దిగుమతి అవుతున్నాయి. మోసంబీ, సీతాఫలం, బొప్పాయి, మామిడి, జామ, పుచ్చకాయ వంటి పండ్లు రంగారెడ్డి, వికారాబాద్‌తో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ, మెదక్, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, గద్వాల్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సాగవుతున్నాయి.

❖ హైదరాబాద్‌లో బాటసింగారం, మోజంజాహీ, గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి పండ్ల మార్కెట్లు ముఖ్యమైనవి. పోషక అవసరాలను తీర్చడంలో ఉద్యానవన ఉత్పత్తులు కీలక పాత్ర పోషిస్తాయి.

గ్రేటర్‌లోకి విదేశాల నుంచి పండ్ల దిగుమతి

- న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, చిలీ, ఆస్ట్రేలియా, ఇరాన్, సౌదీ వంటి దేశాల నుంచే ఎక్కువగా..
- కివీ, చెర్రీ, ప్లమ్, పియర్, డ్రాగన్ వంటి ఖరీదైన పండ్లకు గిరాకీ ఫుల్

బాటసింగారం మార్కెట్‌లోకే 2023-24లో 4,65,633 టన్నుల పండ్లు దిగుమతి అయ్యాయని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ విభాగం తెలిపింది.

ఖరీదు ఎక్కువే..

విదేశాల నుంచి దిగుమతి అయ్యే పండ్లు ఖరీదైనవే ఉంటున్నాయి. డ్రాగన్, కివీ, ఖర్జూర, చెర్రీ వంటి పండ్లు ఎక్కువ ధర పలుకుతుండగా సాగు, సీజన్ బట్టి మామిడి, యాపిల్, దానిమ్మ ధరలు కూడా అధికంగానే పలుకుతున్నాయి. డ్రాగన్ ఫ్రూట్ ధర క్వింటాల్‌కు రూ.1,13,610 ఉండగా.. పియర్ రూ.30 వేలు, కివీ రూ.18,471, చెర్రీ రూ.24,975, నల్లద్రాక్ష రూ.17,344, ఖర్జూర రూ.16,100, మామిడి రూ.13,338, యాపిల్ రూ.15,927, దానిమ్మ రూ.14,225 ఉన్నాయి. సపోటా, మోసంబీ, బొప్పాయి, నారింజ, అరటి వంటి లోకల్ ఫలాలు ధరలు కాస్త తక్కువగానే ఉన్నాయి. వీటి ధరలు రూ.2 వేల నుంచి రూ.6 వేల మధ్య ఉన్నాయి.

రంగారెడ్డిలో 94 వేల ఎకరాల్లో సాగు..

గ్రేటర్‌లో అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. ఉష్ణమండలం, సహజ వనరులు, అనువైన నేలలతో పాటు విస్తారమైన భూమి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. రంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 94,139 ఎకరాల విస్తీర్ణంలో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. జిల్లాలోని మొత్తం పంట విస్తీర్ణంలో ఉద్యానాల సాగు విస్తీర్ణం వాటా 30-40 శాతం వరకు ఉంటుంది. ఈ జిల్లాలో ప్రధానంగా మామిడి, జామ, తీపి నారింజ, దానిమ్మ, ఆమ్ల నిమ్మ, పుచ్చకాయ ప్రధానంగా సాగు అవుతున్నాయి. గత దశాబ్ద కాలంలో ఉద్యానవన పంటలు లాభదాయకమైన రాబడిని అందిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను సృష్టించడం, ప్రాసెసింగ్ పరిశ్రమకు ముడి పదార్థాలను అందించడం, ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడం వంటి కారణాలతో గణనీయమైన ప్రాముఖ్యతను పొందుతుంది.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ స్ఫూర్తికి రక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రాజ్యాంగ స్ఫూర్తితో కాంగ్రెస్ పనిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ మంగళవారం చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని వైఎం తండా, పులిచర్లకుంట తండా, చింతగట్టు తండా, సిద్దాపూర్, ఎస్‌బీపల్లి, కొడిచర్ల గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ రాజ్యాంగంలో పొందుపర్చిన పలు చట్టాలను సవరణ చేస్తూ నిర్వీర్యం చేస్తోందని మండి పడ్డారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి తాము రాజ్యాంగ రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. చట్టాల సవరణతో ప్రజలు ప్రశ్నించే హక్కుకు దూరమవుతున్నారని వివరించారు. రాజ్యాంగ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

అక్రమాలకు పాల్పడిన వారిని వదలం

గత ప్రభుత్వ హయాంలో సిద్దాపూర్‌లో టీజీఐఐసీకి కేటాయించిన భూముల అక్రమాలపై విచారణ సాగుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. కొందరు ఈ విషయమై అసత్య ప్రచారం చేస్తున్నారని వారి ఆరోపణలకు త్వరలోనే సమాధానం చెప్తామన్నా రు. భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్‌చార్జి జైపాల్, మాజీ ఎమ్మె ల్యే ప్రతాప్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌రె డ్డి, శివశంకర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, మల్లారెడ్డి, జంగ య్య, రాంచందర్, దయానంద్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పనికోసం తీసుకెళ్లి..

కూలీల వద్ద బంగారం, నగదు దోపిడీ

నందిగామ: గుర్తు తెలియని వ్యక్తి పని ఉందని ఇద్దరు మహిళలను తీసుకెళ్లి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లిన ఘటన మంగళవారం మండల పరిధిలోని రంగాపూర్‌లో చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి గ్రామానికి చెందిన నిమ్మల విజయ, గండీడు గ్రామానికి చెందిన కావలి సత్తమ్మ కుటుంబ సభ్యులతో కలిసి కొత్తూరుకు వలస వచ్చారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న విజయ, సత్తమ్మ పనికోసం కొత్తూరులోని కూలీ అడ్డా వద్దకు వచ్చారు. గుర్తు తెలయని వ్యక్తి వీరిద్దరినీ పని ఉందని చెప్పి తన బైక్‌పై రంగాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న మరో వ్యక్తితో కలిసి మహిళల వద్ద ఉన్న తులంన్నర బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు దోచుకుని అక్కడ నుంచి ఉడాయించారు. మహిళల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను హైకోర్టులో జస్టిస్ సూరేపల్లి నందా ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 14 నుంచి ఏప్రిల్ 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రాణాలను త్యాగం చేసిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించనున్నారు. బాంబే డాక్ యార్డులో 'ఫోర్ట్ స్టికిన్'అనే నౌకలో 1944లో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలను ఆర్పే క్రమంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటూ వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జూ చూసొద్దాం

సందర్శన టికెట్ రేట్లు పెరిగినా..తగ్గని ఆదరణ

ఆన్‌లైన్ బుకింగ్‌తో క్యూకు ఫుల్‌స్టాప్

నావిగేషన్ యాప్‌తో గైడ్ లేకుండానే జూ సందర్శన ఈజీ

చార్మినార్: పాతబస్తీలోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడుతున్నారు. జూ సందర్శనకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ చాంతాడంత క్యూ లైన్‌లకు ఫుల్‌స్టాప్ పడింది. జూ సందర్శకులకు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే టికెట్ రేట్లు పెరిగినా.. ఆదరణ తగ్గలేదు. అంతేకాకుండా మనం ఎక్కడి నుంచైనా జూ సందర్శన టికెట్లను ఆన్‌లైనా ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చు. జూ బుకింగ్ కౌంటర్ వద్ద ఉండే క్యూలతో ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. సో..మనల్ని మనమే మరచిపోయి కాస్సేపు సరదాగా..ఉల్లాసంగా..ఉత్సాహంగా గడపడానికి నెహ్రూ జూలాజికల్ పార్కు చక్కని వేదిక. అంతేకాకుండా మొబైల్ నావిగేషన్ యాప్‌తో గైడ్ లేకుండానే జూ పార్కును చుట్టి రావచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని జూ సందర్శనకు వెళితే..జూ పార్కులోని అన్ని ఎన్‌క్లోజర్స్‌తో పాటు ఇతర సమాచారాన్ని మన కళ్ల ముందుంటుంది. గత నెల 1వ తేదీ నుంచి కొత్త రేట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పెద్దలకు వీక్ డేస్‌లలో రూ.70, చిన్నారులకు రూ.45 ఉగాను..వీకెండ్‌తో పాటు సెలవు రోజుల్లో రూ.80, రూ.55 ఉండగా.. ప్రస్తుతం రెండు కేటగిరీల వారీగా కాకుండా వారం రోజుల్లో పెద్దలకు రూ.100, చిన్నారుకు రూ.50గా నిర్ధారించారు. వీటితో పాటు జూ సందర్శనలో వివిధ కేటగిరీలకు కూడా రేట్లు పెరిగాయి.



సరస్సులో ఆకట్టుకుంటున్న కొంగలు



నెహ్రూ జులాజికల్ పార్కు

ఆహ్లాదం, వినోదంతో పాటు విజ్ఞానం పంచుతున్న జూ

నెహ్రూ జూలాజికల్ పార్కు ఓ ఎంటర్‌టైన్ మెంట్ పార్కుగా కాకుండా సందర్శకులకు ఆహ్లాదం, వినోదంతో పాటు జంతువు, పక్షులపై కొత్త విషయాలను నేర్చుకునే విద్యాలయంగా చెప్ప వచ్చు. దీంతో జూ సందర్శకుల రద్దీ కూడా పెరిగింది. అప్పుడప్పుడు వచ్చే పాఠశాలలు, కళాశాలలకు సెలవులతో పాటు వీకెండ్ రోజులలో జూపార్కును సందర్శించే సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. వేలాది మంది సందర్శకులకు జంతువులు, పక్షులపై ప్రత్యేక అవగాహనను జూపార్కు అధికారులు కల్పిస్తూ జూలో అనేక కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం కలిగిస్తున్నారు. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా జంతు ప్రపంచం గురించి తెలుసుకునే విజ్ఞాన యాత్రగా జూ పార్కు సందర్శన ఉంటుంది. జూ పార్కును సందర్శించడానికి నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.

జూ సందర్శనకు పెరిగిన ఆసక్తి

జూలో లేని జంతువు, పక్షులను రప్పించేందుకు, జంతువు, పక్షుల సంతానోత్పత్తి చేపట్టడం ప్రారంభించాక జూ సందర్శన పట్ల సందర్శకుల్లో అమితమైన ఆసక్తి పెరిగింది. అత్యంత విషతుల్యమైన పాములు, విషం లేని పాములను స్నేక్ సెల్ బృందం ప్రదర్శిస్తూ వాటి వివరాలను సందర్శకులకు తెలియజేస్తూ పాములపై సందర్శకులకు ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. అంతేకాకుండా వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వన్యప్రాణులను దత్తత తీసుకునే వెసలుబాటును కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లపై సందర్శకులను చైతన్యవంతులను చేస్తూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారు. సందర్శకులు రోజంతా ఉపశమనం పొందడమే కాకుండా ఆహ్లాదకరమైన చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వన్యప్రాణులను తిలకించడమే కాకుండా అనేక విషయాలను తెలుసుకోవడం లాంటి అనుభూతులను జూను సందర్శిస్తే కాని తెలియదు.

ఎప్పటికప్పుడు కొత్తదనం..

జూపార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరించిపోయే జంతువు, పక్షుల సంతానోత్పత్తిని చేపట్టేందుకు జూపార్కు కేంద్ర బిందువుగా ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, సేద తీరేందుకు పచ్చిక బయళ్లు, రచ్చబండలు, సహపంక్తి భోజనాలు చేసేందుకు పచ్చని తోరణాలతో విచ్చుకున్న పచ్చదనం జూపార్కు అందచందాలను తిలకించేందుకు విజిటర్ వ్యాన్, లయన్ సఫారీ, చిట్టి రైలు అందుబాటులో ఉన్నాయి.



ఇద్దరు పాత నేరస్తులకు రిమాండ్

రూ.17.5 లక్షల సొత్తు స్వాధీనం

మీర్‌పేట: తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను మీర్‌పేట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.17.5 లక్షల సొత్తును రికవరీ చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. నాగోల్ డివిజన్ జైపురి కాలనీలో నివాసం ఉండే కారు డ్రైవర్ కట్టెల అనూప్ కుమార్(35), అంబర్‌పేటకు చెందిన వెల్డింగ్ కార్మికుడు మహ్మద్ అఫ్రోజ్‌ఖాన్(26) స్నేహితులు. వీరిద్దరిపై రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని అంకోలా ఠాణాల్లో కేసులున్నాయి. అనూప్‌కుమార్ 80 కేసులు, అఫ్రోజ్‌ఖాన్ 52 కేసుల్లో జైలు జీవితం గడిపి 2024లో బయటకు వచ్చిన వీరు తమ ప్రవర్తన మార్చుకోకుండా మరో నిందితుడు భరత్‌కుమార్ శర్మతో కలిసి చోరీలకు పాల్పడుతున్నారు. ఇటీవల రాచకొండ పరిధిలోని మీర్‌పేట, ఆదిబట్ల, హయత్‌నగర్, చర్లపల్లి, మేడిపల్లి, కీసర, ఘట్‌కేసర్, భువనగిరి, ఆర్మూర్, బాసర, కోదాడ టౌన్ పీఎస్ పరిధిలో 23 చోరీలు చేశారు. దర్యా ప్తు చేపట్టిన మీర్‌పేట క్రైం బృందం ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్ తరలించారు. వారి వ ద్ద నుంచి 170 గ్రాముల బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

ఆలస్యంగా వెలుగులోకి..

రసూల్‌పురా: మానసిక స్థితి సరిగా లేని ఇద్దరు అక్కచెల్లెళ్లు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్ఖాన పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక మనోవికాస్ నగర్ శ్రీనిధి ఆపార్ట్‌మెంట్‌లో మీనా చంద్రన్ (59), వీణా చంద్రన్ (60) అనే అక్కా చెల్లెళ్లు నివాసం ఉంటున్నారు. వీరు చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటమేగాక మానసిక స్థితి సరిగా లేదు. ఈనెల 11న ఇంట్లో తలుపులు వేసుకుని విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గది నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు 13 సాయంత్రం కార్ఖాన పోలీసులకు, మారేడుపల్లిలో ఉంటున్న మరో సోదరి సాధనకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వారి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరి తండ్రి చంద్రన్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కాగా అతను మృతి చెందడంతో గత కొన్నేళ్లుగా అతని పెన్షన్ డబ్బులతో వీరు జీవనం సాగిస్తున్నారని వీరి సోదరుడు దుబాయ్‌లో ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మానసిక స్థితి సరిగా లేని వీరు వింతగా ప్రవర్తిస్తూ ఆపార్ట్‌మెంట్ వాసులను ఇబ్బందులకు గురిచేసే వారని పలుమార్లు వీరిపై పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. సీఐ రామకృష్ణ నేతృత్వంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

రాజేంద్రనగర్: స్లాట్ విధానం వద్దు..పాత పద్ధతే కొనసాగించాలని నిరసిస్తూ రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మంగళవారం తెలంగాణ డాక్యుమెంట్ రైటర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దస్తవేజు లేఖర్లు (డాక్యుమెంట్ రైటర్లు) ప్ల కార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా గురువారం, శనివారాలు డాక్యుమెంట్ రైటర్‌లు ఆఫీసులను మూసి వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు గౌడ్, యాదగిరి, జీవం రెడ్డి, శర్మ, రఫీ, క్రాంతికుమార్, ఖదీర్, రమేశ్, సాయినాథ్, పవన్, అస్లాం, ప్రభాకర్ రెడ్డి, బలరాం, జుబైర్, కస్యం మల్లేష్, శ్యామ్ ఆనంద్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు



పీఅండ్‌టీ కాలనీలో అనుమతులు లేని నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

బండ్లగూడ: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వాటిపై చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలోని ప్లాట్ నంబర్ 29–సీ బ్లాక్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తు నిర్మాణాన్ని అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. నిర్మాణాలు చేసే ముందే పూర్తి అనుమతులు తీసుకోవాలన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ



బాధితులకు ఫోన్లు అప్పగించిన ఇబ్రహీంపట్నం పోలీసులు

ఇబ్రహీంపట్నం: సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు వాటిని రికవరీ చేసి మంగళవారం అప్పగించారు. ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్ తెలిపిన ప్రకారం.. సెల్‌ఫోన్లను పోగొట్టుకుని తమకు ఫిర్యాదు చేసిన బాధితులకు సీఎంఐఆర్ పోర్టల్ సహకారంతో గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సుమారు పది సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కందుకూరు: కందుకూరు ఠాణా పరిధిలో రోడ్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గంలో కొత్తగూడ పంచాయతీ పరిధి బాలాజీ వెంచర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని.. ఒంటిపై ఎటువంటి గాయాలు లేవన్నారు. కొద్ది రోజులుగా కందుకూరు చౌరస్తాలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662687 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వాహనాల బ్యాటరీలు చోరీ

షాద్‌నగర్: పార్క్ చేసిన వాహనాల నుంచి గుర్తు తెలియని దుండగులు బ్యాటరీలను చోరీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో పాటు గ్రామానికి చెందిన వాడ్యాల శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్యకు చెందిన ట్రాక్టర్ల నుంచి, వడ్డె శంకర్ ఆటోలోని బ్యాటరీలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు పశువులు మృత్యువాత



కొందుర్గు: ఎద్దు కళేబరం



యాచారం: ఆవు కళేబరం

కొందుర్గు: పిడుగుపాటుకు ఓ ఎద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బుయ్యని లాలయ్య మంగళవారం ఉదయం తన ఎద్దులను మేపి వ్యవసాయ పొలంలో ఉన్న చెట్టుకు కట్టేసి మధ్యాహ్న భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వర్షం తగ్గిన తర్వాత పొలానికి వెళ్లి చూడగా పిడుగుపడి ఓ ఎద్దు మృత్యువాత పడింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

కుర్మిద్దలో ఆవు..

యాచారం: పిడుగు పాటుకు ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కుర్మిద్దలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసుల సత్తయ్య రెండు నెలల క్రితం రూ.90 వేలు వెచ్చించి పాడి ఆవులను కొనుగోలు చేశాడు. మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు కట్టేసిన ఆవు మృత్యువాత పడింది. ఆవుతోనే జీవనోపాధి పొందుతున్నానని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కొత్తూరు: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ పంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్మికులతో కలిసి ఎంపీడీఓ అరుంధతికి వినతి పత్రం అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు నూతన జీఓల ప్రకారం వేతనాలు పెంచి ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, సౌకర్యాలు కల్పించాలన్నారు. విధుల్లో భాగంగా, సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు బీమా సౌకర్యం, కార్మికులకు రక్షణ పరికరాలు, బూట్లు, మాస్కులు ఇవ్వాలని విన్నవించారు. తరచుగా ఆరోగ్య పరీక్షలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, భిక్షపతి, దేవయ్య, సురేశ్, జంగయ్య, రాములు, కృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యాపారం కోసం యువతుల ఎర

- పబ్ యాజమాన్యం నిర్వాకం
- డీజే సాంగ్స్, అసభ్య నృత్యాలు
- వైల్డ్ హార్ట్ పబ్‌పై చైతన్యపురి పోలీసుల దాడి
- 16 మంది యువతుల అరెస్ట్, పరారీలో పబ్ నిర్వాహకులు



కొత్తపేటలోని వైల్డ్ హార్ట్ పబ్

చైతన్యపురి: వ్యాపారాన్ని పెంచుకునేందుకు కస్టమర్లకు యువతులను ఎరవేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఓ పబ్‌పై చైతన్యపురి పోలీసులు దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.కొత్తపేట కిలా మైసమ్మ దేవాలయ సమీపంలోని వైల్డ్ హార్ట్ పబ్‌లో యువతులతో అసభ్య నృత్యాలు చేయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా డీజే సౌండ్‌లో యువతులతో అర్ధనగ్న నృత్యాలు చేయిస్తుండటమేగాక, నిబంధనలకు విరుద్ధంగా అధిక సమయం పబ్ తెరిచి ఉంచుతున్నట్లు గుర్తించారు. 16 మంది యువతులను డీజే ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి యువకులే టార్గెట్..

పబ్‌కు వెళ్లాంటే కస్టమర్ల నుంచి ఎంట్రీ ఫీజు వసూలు చేస్తారు. జంటలుగా వచ్చిన వారిని కాకుండా మద్యం సేవించేందుకు ఒంటరిగా వచ్చిన యువకుల వద్దకు యువతులు వచ్చి వారికి కంపెనీ ఇస్తారు. అసభ్యంగా డాన్సులు చేస్తూ తాము సేవించే మద్యం, ఆహారం కూడా సదరు యువకుల బిల్‌లోనే వేస్తారు. వ్యాపారం పెంచుకునేందుకు మోసపూరితంగా పబ్ నిర్వాహకులే యువతులకు ఫ్రీ పాస్ ఇచ్చి లోపలికి పంపిస్తారు. తద్వారా బిల్లు ఎక్కువ అయ్యేలా చేసి వ్యాపారాన్ని పెంచుకుంటారు. ఇందుకు గాను ముంబై నుంచే కాక నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి యువతులను పబ్ నిర్వాహకులు ఎంగేజ్ చేసుకుంటున్నట్లు తెలిపారు. బ్యూటీషియన్స్, జూనియర్ ఆర్టిస్టులను ఎంచుకుని ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పట్టుపడిన యువతులను వనస్థలిపురం, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాలకు చెందినవారిగా గుర్తించామన్నారు. 16 మంది యువతులతో పాటు డీజే ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, పబ్ యజమాని రాము, మేనేజర్ సంతోష్ పరారీలో ఉన్నట్లు ఆయన వివరించారు.

మణికొండలో జలమండలి తనిఖీలు



మోటార్లను స్వాధీనం చేసుకున్న జలమండలి విజిలెన్స్ అధికారులు

మణికొండ: తాగునీటి కనెక్షన్‌లకు మోటార్లను బిగించి అధిక మొత్తంలో నీటిని తీసుకుంటున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. మంగళవారం నుంచి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అధికారులు బృందాలు తనిఖీలు చేస్తున్నారు. మొదటి రోజు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, నేతాజీ కాలనీలలో నల్లా కనెక్షన్‌లకు ఏర్పాటు చేసిన మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఏర్పాటు చేసిన వారికి రూ.5వేల చొప్పున జరిమానాలను విధిస్తున్నామని విజిలెన్స్ సిబ్బంది తెలిపారు. మరోసారి అదే పద్ధతిలో మోటార్లను ఏర్పాటు చేస్తే వారి నీటి కనెక్షన్‌లను తొలగించడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.